# ఇదా ఆకలి?

> అవసరమైంది అందనప్పుడు అందరం సభ్యత గీతను దాటే వాళ్ళమే.
>
> —జయప్రద

నా శరీరంలో ప్రవహించే నెత్తురు హిమాలయ పాద ప్రాంతాల మంచులా ముద్ద కట్టుకుపోయి వెంటనే కొండల మీదినుండి విరుచుకు పడుతూ ఆయాసపడే సెలయేరులా నురగలు కక్కుతూ ప్రవహించ నారంభించింది. నా నరాలు నాగు బాముల్లా వుండచుట్టుకు పోతున్నాయి. నా సర్వేంద్రియాలూ స్వశక్తిని కోల్పోతున్నాయి. నా గుండెల్లోని సిరల్లో, ధమనుల్లో రక్తం ఎదురు తిరిగి ప్రవహిస్తోంది. నా మెదడులోని నరాలు హాహాకారాలు చేస్తున్నాయి. కానీ నా మెదడింకా పని చేస్తోంది. నా గుండె ఇంకా కొట్టుకుంటోంది. ఇది వాస్తవమా? నేను మనిషినా ?

★ ★ ★ ★

"ఒరే బాబ్జీ, చందూ అక్షరాభ్యాసం ఘనంగా చెయ్యాలిరా" అన్నాను మేనల్లుడ్ని చూడడానికి వచ్చిన నా తమ్ముడితో నెల్రకితం.

'నీకింకా ఈ పిచ్చి వదలలా' అన్నట్టు చూచి, కాస్సేపాగి–

"ఘనంగా అంటే ఎలా చేయాలనీ" అన్నాడు వాడు.

నేను సిగ్గు పడుతూనే చెప్పాను- "నా దగ్గర రెండువేల రూపాయలున్నాయిరా" ఆ తర్వాత వాక్య నిర్మాణం వాడికే వదిలేసాను.

'నీ దగ్గర అంతడబ్బెక్కడిదీ?' అన్నట్టు క్షణం ఆశ్చర్యంగా చూచి–

"అయితే చందూ స్కూల్ పిల్లలందరినీ పిల్చి ఘనంగా పార్టీ చేద్దామా?" అన్నాడు.

నాకు వాడి సూచన అంతగా నచ్చలేదు. అందులో ప్రత్యేకత ఏముంటుంది? అందులో గుర్తు పెట్టుకోదగింది ఏముంటుంది. నాకు ఊహ తెలిసే రోజుల్లోనే నాలో ఒక కోరిక తలెత్తింది. నాకంటూ ప్రత్యేకంగా ఒక ఫంక్షన్ జరుపుకోవాలనీ, దానిని అందరూ 'అబ్బా!' అనాలనీ, నా పదేళ్ళ వయసులో కాబోలు నా పుట్టినరోజు స్కూల్లో అందరి పిల్లల్లా జరుపుకోవాలని, మెల్లిగా బెదురుగా అమ్మ నడిగాను నేను. అడిగిన తీరుచూచి కాబోలు అమ్మ ఫక్కున నవ్వింది. ఆ నవ్వు అలా కొనసాగలేదు. మధ్యలోనే అమ్మ విచారంగా మారిపోతూ అంది.

"మన మధ్యతరగతి కుటుంబాల్లో ఇలాటి కోరికలన్నీ కలలవరకే వదిలేయాలి ఇందూ" అని నా తల నిమురుతూ.

నాలో ఒక చెడ్డ గుణముంది. పొగడ్తలకూ, అభిమానాలకీ కూడా సమంగా లొంగిపోతాను నేను. అందువల్లే నాకు కోరిక తీరనేలేదు. పోనీ స్కూల్ లో ఫైనల్ పాస్ అయినపుడు నా ఫ్రెండ్సనంతా పిలిచి పార్టీ ఇవ్వాలనుకున్నాను.

అమ్మ కళ్ళతోనే మందలించి, నా కన్నీళ్ళు తుడవడానికి ఆరోజు ఇంటిలో పాయిసం, గారెలు చేసింది.

ఆ తర్వాత నా పెళ్ళయింది.

ఓ మధ్యతరగతి కుటుంబంలోనుండి మరో మధ్యతరగతి కుటుంబంలోకి వచ్చిపడ్డాను.

కానీ ఒక్కటే తేడా.

మా అమ్మగారింట్లో కోరికలు చంపుకుంటారు. మా అత్తగారి ఇంటిలో వాటిని తీర్చుకునే ఉపాయంకొరకు వెతుకుతారు. ఇదొక్కటే నాకు ఆసరా అయింది.

మాది ఉమ్మడి కుటుంబం అందరూ కలిసి వెయ్యిరూపాయల వరకు సంపాయిస్తారు. కానీ మా ఇంటి ఖర్చులకు అది బొటాబొటీ సరిపోయేది.

ఆ ఇంట్లో కూడా నా కోరిక తీరే మార్గంలేదని తేలిపోయింది. కానీ రోజులు గడిచేకొలదీ నా కోరిక పెరిగిందే కానీ తగ్గలేదు. కానీ నా వయసుతోబాటు నా కోరిక తీరులో మార్పువచ్చింది.

నలుగుర్నీ ఇంటికి ఆహ్వానించి పార్టీలు ఇచ్చే స్థితినుండి ఆ కోరిక ఎదిగింది.

నా కోరిక ఒక ప్రత్యేకత సంపాదించుకోవాలి. అందుకే నాబాబు బారసాల అయినా కొత్తరకంగా చేయాలనుకున్నాను. కానీ కొత్తఏమిటో నాకే తెలియదు.

ఏది ఎమయినా బారసాల రోజుకి నా చేతిలో చిల్లికానీ లేకపోవటంతో కేసలం నామకరణంతో పప్పు పరమాన్నాలతో ముగించాల్సి వచ్చింది.

ఆ నిరాశలో నేనుండగా అమ్మ నా పదకొండు రోజుల పసిబిడ్డ మెడలో ఓ సన్నటి బంగారపు గొలుసు వేసి ముద్దుపెట్టుకుని కన్నీళ్ళు నింపుకుంది.

ఆ చిన్న గొలుసు వెనుక మా పుట్టింట్లో జరిగిన కథలను నేనూహించగలను.

"ఎందుకమ్మా ఇదంతా?" అన్నాను–మనస్ఫూర్తిగానే అన్నాను.

అలా అన్న తర్వాత నా కోరికకు ఏదో పునాది దొరికినట్టనిపించి మరి మాట్లాడేదు.

"చెల్లాయ్! బజారుకెళ్ళడానికి టైములేకపోయింది. బుజ్జిగాడికొక చొక్కా కొనివ్వు" అని పెద్దన్న ఇరవయ్ అయిదు రూపాయలు చేతిలో పెట్టాడు.

అది నా పునాదికి నాలుగు రాళ్ళు పెట్టినట్టయింది. ఆ తర్వాత గొలుసు అమ్మేసాను.

అమ్మవాళ్ళడిగితే–"ఏదో అవసరానికి ఇంట్లో వాడేసాను. అవసరానికంటే బంగారం ముఖ్యమా?" అని తేలిగ్గా అబద్ధమాడేసాను.

అమ్మకూడా "పోన్లే! అత్తగారింట్లో మంచిపేరు తెచ్చుకుంటుంది" అని సరిపెట్టుకుంది.

ఆ తర్వాత నా మరుదులు బొమ్మలు ఏమైనా చందూకి తెచ్చివ్వబోతే మొహమాట పడకుండా చెప్పేసేదాన్ని.

"ఆ డబ్బులు ఏదో నాకిచ్చేస్తే దానికిష్టమైనవి కొనిపెడతాను–అనవసరంగా బొమ్మలకు తగలెయ్యకండని"

ఇవన్నీకాక ఒక హుండీ కూడా పెట్టాను.

అందరూ దానికి వెంకటేశ్వరస్వామి హుండీ అని నామకరణం చేసారు.

ఎవరయినా దేముడికి మొక్కుకుని తిరుపతి వెళుతుండే వాళ్ళ దగ్గరనుండి నిస్సంకోచంగా దానం పుచ్చుకొని అందులో వేసేదాన్ని.

ఆ హుండీపెట్టి ఈ నాటికి ఐదు సంవత్సరాలయింది.

ఆ హుండీలో రెండువేలరూపాయలు వుండి వుండాలి.

నేను హుండీలో వేసిన ప్రతిపైసా నా మెదడులో లెక్కలు పెట్టుకుంటూనే వున్నాను.

"పోనీ బీదవాళ్ళకి అన్నంపెట్టి ఒక చొక్కా గుడ్డ ఇస్తే" అన్నాడు వాడు నవుగుతూ.

"బాగానే వుంటుందోయ్ బావమరిదీ నీ సలహా అన్ని గుడ్డలంటే మాటలా మనం తూగొద్దూ?"

మా శ్రీవారి అభ్యంతరం నా చెవుల్లోకి దూరలేదు. మా తమ్ముడి సలహా నాకంతగా నచ్చిందన్నమాట.

"ఓ రెండువందలమంది అనుకుంటే సరిపోతుంది" అన్నాడు తమ్ముడు.

నేను మనసులోనే గబగబ లెక్కలు కట్టేసాను.

పిల్లలకు ఒక పలకా, బలపం, ఒక్క చొక్కాగుడ్డ పెద్దవాళ్ళకు ఒక చొక్కా, ఆడవాళ్ళకయితే ఒక రవికగుడ్డ అందరికీ భోజనం....

ఒకరకంగా నా దగ్గరున్న డబ్బు సరిపోతుంది—అంతలోనే నాకు మరో సందేహం వచ్చింది.

"అంతమంది వస్తారంటావురా?"

"ఓ! నువ్వు ఇవ్వాలేకానీ వెయ్యిమంది రారూ?"

"నువ్వుండవోయ్ బావమరిదీ! మీ అక్కను ఎంకరేజ్‌చేసి నా కొంప కూల్చేటట్టున్నావు" నవ్వారు.

మా శ్రీవారి నవ్వు నాకట్టే నచ్చలేదు.

"అఁ మీరిచ్చే నాలుగురూపాయల చొక్కాగుడ్డకు ఒక్కపూట భోజనానికి పరిగెట్టుకుంటూ వస్తారు వెయ్యిమంది!"

శ్రీవారు ఈమారు ఏం మాట్లాడలేదుగానీ ఇప్పుడు ఆలోచిస్తే తన నవ్వులో జరగబోయేది సూచాయగా వ్యక్తంచేసారు.

* * * *

చందూ అక్షరభ్యాసం దగ్గరకొచ్చేకొలదీ నాలో స్పందన.

ఎలా జరుగుతుందో అనే ఆవేదన ఊర్లో నాలుగుచోట్ల నలుగుర్నీ రమ్మని దండోరావేసి పిలవాలనే ఉద్దేశంకానీ, పేపర్‌లో అడ్వర్‌టైజ్ మెంట్ ఓ మూలయినా వేయించాలనే సూచనగానీ ఈ ఇంట్లో ఒక్కరికి కలగనందుకు చిరాకు.

నా దగ్గరున్న డబ్బుఖర్చు-శ్రమా అంతా వృధా అయిపోతుం దేమోననే శంక మాత్రం నన్ను వదలడంలేదు. ధైర్యంచేసి మామయ్యనే అడిగేసాను.

"ఏమిటమ్మా ఇందిరా నీ పిచ్చి! మనం పిలవాలా? వాళ్ళేవస్తారు" అని నవ్వి అప్పుడే వాకటి ముందుకొచ్చిన ఓచ్చగాడితో....

"రేపు రావోయ్ మా కోడలు ఇక్కడ అన్నంపెడుతుంది" అలా మామయ్య వాడితో చెపుతుంటే నన్ను ఆ మాటలు మొహమాటంలోకి తోసాయి.

* * * *

పదిహేను సంవత్సరాల నా కల పండబోతున్న రోజు రానే వచ్చింది.

ఇంటిలో అంతా హడావుడి-గాడిపొయ్యలు ధగధగాయమానంగా వెలిగిపోతున్నాయి.

చందూని వేకువనే లేపి స్నానం చేయించి నేను చేసి, చందూకి మంచిబట్టలు వేసి అక్షరాభ్యాసం తతంగంలో కూర్చోబెట్టాను.

ఆ అయ్యగారు ఏం చేస్తున్నాడో వీడు ఏం పలుకుతున్నాడో ఆ ధ్యాసే నాకు లేదు. రెండువందలమంది వస్తారా? లేదా? నా మనసంతా బయటే వుంది.

ఆడవాళ్ళంతా గాడిపొయ్యల దగ్గరున్నారు. అన్నయ్య వడ్డన ఎలా చేయించాలా అనే కార్యక్రమంలో మునిగున్నారు.

శ్రీవారు, మామగారు, ఇద్దరు మరుదులు బయట వస్త్రాల పంప కము ఎలా చేస్తే బాగుంటుందా? అని చర్చించుకుంటున్నారు.

నేను మాత్రం చందూ అక్షరాభ్యాసం-అయ్యవారి సంభావనలు ముగించి నాకున్న ఒకే ఒక పట్టుచీర ధరించి బయటికొచ్చాను. గేటుకు ఆవతలగా కొన్ని వందల తలలు.

నా నిరాశ, ఆవేదన ఒక్కసారిగా పటాపంచలయిపోయింది. విపరీతమైన సంతోషంలో మునిగిపోయాను నేను. నా సంతోషంలో నా శ్రీవారికి కూడా భాగం పెట్టాలనే ఉద్దేశంతో తలత్రిప్పి చూసాను. ఆయన ముఖంలో సంతోషం లేకపోతే మానె అంత చిక్కటి అంత విచారమెందుకు? నేను ఆయన భావాలను బాగా అర్థం చేసుకో నుండుంటే ఈ సంరంభాన్ని బాధ్యతాయుతంగా నిర్వర్తించగలమా? అనే టెంషన్ స్పష్టమయ్యేది. కానీ నా ఉరకలు వేసే ఆనందంలో నాకేమీ అర్థం కాలేదు. అది అంత పట్టించుకో తగ్గ విషయంగా కూడా అన్పించలేదు. చందూని బలవంతంగా తీసుకొచ్చి పలకల దొంతరల దగ్గర నిలబెట్టాను. వాడిచేత ఇప్పించాలని నా ఉద్దేశం.

"చూడు ఇందూ! వాడిచేత ఇప్పించాలంటే అది అయ్యేపని కాదు. వాడిని నువ్వు లోపలికి తీసుకెళ్ళు...."

నా భావం అర్థం అయినట్టు అనేసి మరలా గేటు దగ్గరకెళ్ళి పోయారాయన.

"పెద్దబ్బాయ్! జాగ్రత్తగా ఒక్కొక్కరినే పంపించు" అనేసి మామగారు లోపలికొచ్చేసారు.

గంట అప్పటికే ఒంటిగంట అయింది. బయట అందరిలో అసహనం రేగినట్టు రణగొణ ధ్వనులు.

"ఇంక గేటు తియ్యొచ్చు అంతా సిద్ధమయింది" అన్నయ్య వచ్చి చెప్పేసి హడావుడిగా వెళ్ళిపోయాడు.

"ఒక రెక్క తియ్యి. అంతా గేటు తీయకు"

* * * *

బీదా సాదా, చిన్నా పెద్దా ఒకేసారి ఒకే త్రోవ. నిలువునా అడ్డముగా త్రోసుకుంటూ కొన్ని పనుల పాదాల అస్తవ్యస్తపు నడక.

కొన్ని వందల జతలకళ్ళు ఆశాపూరిత దృక్కులు మధ్యలో చిన్న చిన్న పాదాలు, చిగురుటాకులలాటి చేతులు.

"ఓయమ్మో! కాలు త్రొక్కేసేడు రోత్"

"ఏటిరా దిక్కులు సూత్తున్నావ్"

"ఒరే సన్నాసీ అమ్మని పెద్ద పలక అడగరా మంచిగా సదువు రావాలి నీకు"

"నేను తర్వాతొత్తా నువ్వు దూతొసే"

"అయ్యో, అయ్యో బిడ్డ నలిగిపోతున్నాడు"

"నా కాళ్ళు, నా చేతులు నా బిడ్డ"

"ఒక్కొక్కరే రండి"

వున్నట్టుండి అంతా గందరగోళం, భయానకమైన అరుపు,

కాలంలోని సముద్ర ఘోష నా గుండె అరల్లో వెయ్యి సుడిగుండాల ఒరవడి.

"పెద్దబ్బాయ్! మిగతా గేటు మూడురెక్కలు లాగేయ్ త్వరగా. చిన్నబ్బాయ్ నువ్వూ పో త్వరగా పో"

"పెద్దబ్బాయ్! ప్రక్కకు జరుగు. నువ్విక జనాన్ని ఆపలేవు. జరుగు....జరుగు" మామయ్య కేకలు.

ఏమి జరుగుతుందో తెలియని అయోమయం. తెలిసే సరికి కన్ను మూసి కన్ను తెరిచే లోపల ఘోరం జరిగిపోయింది.

"అమ్మా! నాకో పలకివ్వవూ?" అని అడగడానికి వచ్చిన రెండు చిన్న లేత చేతులు జీవ రహితంగా వాలిపోయాయి. మరి పలక అవసరం లేని దూర తీరాలకు వాడి జీవం సాగిపోయింది.

పదిహేను సంవత్సరాల నా కల పండీ పండకముందే నా తీరని కోర్కె నాలో రేపే గర్వరేఖలు నా కళ్ళల్లో ప్రతిఫలించీ ప్రతిఫలించక ముందే నా పెదవులమీద చిరునవ్వును దోచుకున్న ఆ మృతపాత్రి నన్ను వెక్కిరిస్తున్నట్లుంది.

కొన్ని సెకండ్ల క్రితం సజీవంగా వున్న లేత చిగురుటాకు వంటి చెయ్యి—

"అమ్మా! ఓ పలకివ్వవూ" అని అడుగుతున్నట్లే వుంది.

నా గెలుపు నన్ను వెక్కిరిస్తోంది. నా శరీరంలో ఉష్ణరుధిరంతో పాటు ప్రవహించే పశ్చాత్తాపం ఆ తల్లి శరీరాన్ని చల్లార్చలేక పోయింది.

"ఒరే నాయనా! నా బంగారు తండ్రీ! మీ అమ్మ నీకు ఒక పలకా బలపం కూడా కొనివ్వకుండా ఊళ్ళమీద పడి సంపాయించుకో మంటని నామీద కోపమొచ్చి ఎల్లావా నా తండ్రీ!"

సమస్త జీవకళ హరించుకుపోయినట్టూ, సర్వ ద్వారాలు బంధించ బడ్డట్టు, కన్నీటి పరదాలో ఆమె రోదిస్తోంది.

ఆ తల్లి రోదనతో గాలి వణికింది. సృష్టి ఊపిరి బిగబట్టింది. ఘోరావేదన ఘనీభవించి కాల గమనాన్ని క్షణం కదలనీయలేదు. శోకో ద్వేగంతో చైతన్యం కోల్పోయిన పరిసరాలు మృత్యు శీతలమైపోయాయి.

మహా గందరగోళం తర్వాత అనంతమైన మౌనం.

నా మనసునిండా తట్టుకోలేనంత మానసిక సంక్షోభం, ఇలా ఎందుకు జరుగుతుందో తెలియని అయోమయావస్థ. కానీ కార్యం తల పెట్ట వుండకుంటే ఎంత బాగుండేది.

నాలో కోటి గుండెల ప్రతిధ్వనులు.

అంధకారంలో తారుడబ్బా దొర్లించినట్టు మనస్సునిండా చీకటి ఆవరించుకుంది. నా మెదడులో నరాలు బ్రద్దలవుతున్నాయి.

ఓ క్రొత్త పలకతో బడికి పోవాలని ఆశపడ్డ ఓ పసిబిడ్డమీద ఒక కొత్తగుడ్డ కప్పి కొత్త తీరాలకు వీడ్కోలు ఇస్తున్న మసక మసక దృశ్యం.

మౌనం బద్దలయింది.

"ఒసే! పాపిష్టిదానా! నా బిడ్డను నీ పొట్టన పెట్టుకున్నావు కదే! నీ బిడ్డను మాత్రం ఆ దేవుడనే వాడే వుంటే నీకు దక్కనిస్తాడా?" లీలలా శోకతప్త అయిన ఆ తల్లి ఇస్తున్న శాపం.

"ఏదో శోకంతో అంటోందిలే తల్లీ నువ్వు పట్టించుకోకు" మామయ్య ఓదార్పు.

"పోలీసుల్ని పిలవాలా?"

"ముత్యంలాంటి బిడ్డ భవిష్యత్తంతా ఎదుటే వున్న పసికందు కేవలం ఒక పలక, ఒక గుడ్డముక్క కొరకు ఒక పూట తిండి కొరకు"

నా పాపానికి నిష్కృతి వుందా?

"ఇందిరా! అలా వణికిపోతున్నావేమ్మా! నీ తప్పేంలేదు తల్లీ! నువ్వు భయపడకు. నీకు మేమంతా లేమూ?" లీలగా సానుభూతి. నా తల మీద చల్లటి స్పర్శ.

దూరాన మరలా గందరగోళం కలగాపులగంగా అరుపులు, చర్చలు, పరిష్కారాలు, వేదాంతం. ఆ తర్వాత అంతా నిశ్శబ్దం.

చిత్రం! నేను స్పృహ కోల్పోలేదు. ఆ దశదాకా వెళ్ళి సలక్షణంగా వెనక్కి తిరిగి వచ్చేసాను.

'ఓ పలకివ్వవూ?' అని అడగడానికి వచ్చిన ఐదేళ్ళ పసికందు తన ప్రయాణాన్ని మధ్యలో తెప్పుకుని మూడడుగులు జాగాను వెతుక్కుంటూ శ్మశానం కేసి సాగిపోయింది.

ఒక్క క్షణం అంతా నిరోమయం. భయంకరమైన వైరాగ్యం-కర్తవ్యం గురించి ఆలోచించే మనోశక్తిని కోల్పోయి బొమ్మలా నిల్చుండిపోయిన నేను ఉలిక్కిపడ్డాను.

"బాబుగారూ! మేము ప్రొద్దుటినుండి కాచుకున్నాం. మమ్మల్ని పంపించి వేయరూ!"

బీదరికం ఇంత భయంకరమైందా? మానవత్వాన్ని తినేసేటంత టిదా?

తమ మీదుగా కదిలిపోయిన ఓ పనికందు మృతదేహం కూడా వీళ్ళ ఆకలిని అణచలేక పోయిందా? ఆకలి ఇంత హైన్యమయిందా?

నాకు పాముల్లా కన్పించే వస్త్రాలవైపు, విషంగా అగుపించే అన్నం వైపు ఆబగా, ఆశగా చూస్తున్న వాళ్ళచూపులు హేయంగా అన్పిస్తున్నాయి. విరక్తిగా గొణిగాను.

"మీకు....మీకు....ఇంకా ఆకలేస్తోందా?"

నా ఎదురుగా వున్న అరవై సంవత్సరాల వృద్ధురాలు నడుము వంగి పొట్ట వెనక్కి అతుక్కుపోయిన పండుముసలి నవ్వింది.

"ఇది ఆకలితల్లి!" అంతకంటే ఆమె ఏమీ మాట్లాడలేదు.

వెన్నుమీద ఎవరో చళ్ళున చరిచినట్లయింది.

"నీకేం తెలుసు ఆకలి తాలూకు అమానుషత్వం?" అని ఆమెను నిలదీసి అడుగుతోంది. ఆకలి కళ్ళతో ప్రశ్నిస్తోంది.

కేవలం ఆకలి తీర్చుకోవడానికి కొంత కొత్త బట్ట సంపాదించుకోవడానికి కొన్ని మైళ్ళదూరం కాలి నడకన వచ్చి కొన్ని గంటల నుండి దాని కొరకు నిరీక్షిస్తున్న వాళ్ళకు ఈ శ్మశాన వైరాగ్యం చుట్టుకోలేదు.

"అమ్మా! ఓ పలకివ్వవూ?" ఉలిక్కిపడి తలెత్తాను మరో అయిదేళ్ళ పసికందు ఆశాపూరిత నేత్రాలు నా ప్రాణాన్ని కొద్దికొద్దిగా క్లోరి చేస్తున్నట్టున్నాయి.

నిర్జీవంగా, అసంకల్పితంగా పలకలున్న బల్ల తడిమాను ఖాళీగా వుంది

"అయిపోయాయి పాపా!"

ఆ పాప కదల్లేదు.

"ఈ బిడ్డకో గుడ్డముక్క ఇప్పించండి సామీ! పదిమైళ్ళనుండి నడిచొచ్చాను"

మూడేళ్ళ పసికందుకు కావాల్సిన రెండురూపాయల గుడ్డముక్క కొరకు అరగంటనుండి ప్రాధేయపడుతోంది. అన్నయ్య అయిపోయాయని ఎంత సర్దిచెప్పినా వినకుండా అడుగుతోంది.

రెండు రూపాయలు పెట్టి ఓ గుడ్డముక్క కొనివ్వలేని స్థితిలో వున్నారా వీళ్ళు-కూలీ కెళ్ళినా రోజుకు నాలుగు రూపాయలు ఇస్తారే !

ఎవరో నా ఆలోచనా పరిధిని పట్టి లాగినట్టు చటుక్కున ఆగి పోయాను.

కూలి డబ్బులు కేమొస్తున్నాయి? ఒకవేళ వచ్చినా అవి తెచ్చు కోవడానికి క్యూలో నిలబడే టైమ్‌లో కూలీ మాటేమిటి ?

ఇంకా పలక కొరకు ఆ పసిపాదాలక్కడే నిలబడి వున్నాయి.

తన తల్లి దండ్రుల అసమర్థత గ్రహించి తన పలక తను సంపాయించుకునేంత బాధ్యత తెలిసిందా ఆ పిల్లకు ! బీదరికం బాధ్య తలను నేర్పిస్తోందా?

అక్కడ నుండి నీరసంగా ఒదిలి ఇంట్లో కెళ్ళబోతున్న నాకాళ్ళు ఆగిపోయాయి.

కొన్ని నిముషాల క్రితం జరిగిన మోరమరణం ఎవ్వరికీ గుర్తు న్నట్టులేదు. ఒక్కక్షణం వ్యర్థమయితే తమకి ఇక జన్మలో అకలి తీర్చు కునే ప్రాప్తం వుండదన్నట్టుగా కంగారుగా, ఆబగా, తింటున్నారు.

శ్మశాన వైరాగ్యాన్ని కూడా అధిగమించి కడుపులు నింపు కుంటున్న వాళ్ళను నిర్వణ్ణురాలినై చూస్తూ నిలుచుండి పోయాను.

ఏదో ప్రత్యేకత కొరకు ఈ ఫంక్షన్ ఏర్పాటు చేసానేకానీ అకలి ఇంత అమానుషమైందని నాకు తెలియదు.

ఇదా ఆకలి? ఇదా నా దేశం? ఇదా స్వతంత్రం? ఈ వందలాది, వేలాది, కోట్లాది ఆకలి కడుపులను చూచి విచారపడాలా? లేక వీళ్ళకంటే ఉచ్చస్థితిలో వున్న నన్ను చూచి నేను సంతోష పడాలా?

తన గొప్పింటి స్నేహితురాలితో, పరిచితురాలిగా, పాత స్నేహితురాలిగా తను అందుకున్న ఆహ్వానాలు, పెళ్ళి భోజనాలు, డిన్నర్లు.

"రండి వదినా!....రండమ్మా....మీరు ఆంటీ, అమ్మా మీరూ!" పేరు పేరునా భోజనానికి రమ్మని ప్రాధేయ పడడాలు-

కాళ్ళల్లో నీరసం నింపుకుని, కళ్ళల్లో విసుగు దాచుకుని సభ్యత కొరకు పెదవుల మీదికి చిరునవ్వు అరువు తెచ్చుకునే బంధువు లక్కడ.

పిలవని పేరంటంగా అన్నదాతలకి శ్రమ ఇవ్వకుండా బారులు తీర్చి కూర్చుని కాలిన కడుపులిక్కడ.

దగ్గరగా కసుక్కున కొరికిన శబ్దం-ముదిరిన ఆనపకాయ చేసిన సవ్వడి అయుంటుంది. చేసిన ఒకే ఒక్క కూర అది. సందేహం లేదు.

"అబ్బ! ఇన్ని వెరైటీస్ నేను తినలేను బాబూ!" ఒక సుకుమారి విసుగు. అక్కడ-తీరిన ఆకలి అక్కడ.

పోసిన గరిటెడు పాయసాన్ని నాక్కుంటున్న అర్ధాకలి ఇక్కడ.

స్వీట్స్ అంటే వెగటు బాబూ నా స్నేహితురాలి కంఠం గింగురు మంటోంది.

ఇంత ఆకలి ఇక్కడుందని వాళ్ళకి నాలా తెలియదా? లేక తెలిసీ దానిని విస్మరిస్తున్నారా? లేక సమానపు హోదాలో వాళ్ళని పిలిస్తే ప్రొద్దున వాళ్ళ ఫంక్షన్‌కి తాము చీర కట్టుకుని అవే పాయిదాలో కూరలు కెలికేసి రావచ్చనే డాంబికమా ?

పెద్దవాళ్ళ డిన్నర్లకు ఈనాటి ఆకలి కడుపుల్ని కూడా జీర్ణం చేసుకోలేక సతమత మవుతున్న నేను మరోసారి ఉలిక్కి పడ్డాను.

"అమ్మగారూ! నాకో పలక ఇప్పించరూ!" అదే పసిపిల్ల కళ్ళ నిండా దీనత్వాన్ని నింపుకుని అర్థిస్తున్నాయి.

ఇంక నాలో శక్తిలేదు. గుండె కొట్టుకోవడం ఆగి పోలేదు. కానీ మెదడు పనిచేసే శక్తిని మాత్రం కోల్పోయింది.

*